క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యాలవాడ : 2024–25 విద్యా సంవత్సరానికి గాను స్థానిక మోడల్‌స్కూల్‌లో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 7,8,9, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 8వ తేదీలోపు విద్యార్థులు పాఠశాలలోనే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 9వ తేదీన పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివిధ కేటగిరీల వారిగా ఖాళీల వివరాలను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచామని పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



పెద్దకంబలూరులో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రుద్రవరం:ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని రుద్రవరం పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి ప్రజలకు సూచించారు. మండలంలోని పెద్దకంబలూరులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 130 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ వాణి,హెల్త్ అసిస్టెంట్ కిరణ్,డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రశాంత్,ఆశా వర్కర్లు ఉన్నారు.

ఏపీజీబీ ఆవిర్భావ దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 19వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్‌ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం బ్యాంక్ సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను 2,299.63 కోట్ల డిపాజిట్లు, 2,371.57 కోట్ల రుణాలు వ్యాపారం నమోదు చేసుకుందన్నారు. డిపాజిట్లపై అన్ని ప్రభుత్వ బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తుందన్నారు. మేనేజర్లు వంశీకృష్ణ, మోహన రామకృష్ణ, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి అండగా ఉంటాం



సుభాన్‌ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటామని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో హోంగార్డు సుభాన్ పదవీ విరమణ సందర్భంగా ఎస్పీ అభినందించి మాట్లాడారు. సుభాన్ హోంగార్డుగా పోలీస్ శాఖకు 1988 నుంచి సేవలందించారని ఆయనకు ఎటువంటి అవసరమొచ్చినా నేరుగా తమను సంప్రదించవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఆత్మకూరులో విధులు నిర్వహిస్తూ సుభాన్ పదవీవిరమణ పొందారన్నారు. అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఆర్ సీఐలు నాగభూషణం, మంజునాథ్ , హోంగార్డు ఇన్‌చార్జ్ దాసు నాయక్ పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో పక్షవాతం నివారణ

నంద్యాల(వ్యవసాయం): ఆయుర్వేద వైద్యంతో పక్షవాతం వ్యాధిని నివారించవచ్చని ఆయుర్వేద వైద్యుడు విశ్వవైద్య సూర్యానాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఎన్నో అద్భుతమైన మందులను మనకు అందుబాటులోనే ఉంచిందని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే వ్యాధి నివారణ సాధ్యమేనన్నారు. ఈ విధానంలో తాను పలువురికి వైద్యం చేయగా మెరిగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. పక్షవాత నివారణలో తన సేవలకు గుర్తింపుకు గాను విశ్వ వైద్య పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లోనున్న హోటల్ యజమానులు మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మహేష్, మధు, మూలాలమ్మ స్థానిక పద్మావతినగర్‌లో హోటల్ నిర్వహిస్తున్నారు. హోటల్ ముందు రహదారిపై పరమేశ్వరమ్మ అనే మహిళ తోపుడు బండిపై టిఫన్ సెంటర్ నడుపుతోంది. ఈ విషయంలో ఇద్దరూ ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో పరమేశ్వరమ్మపై ముగ్గురు దాడి చేయటంతో గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు.




ఆళ్లగడ్డ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేకలలంకరణలో ఆంజనేయస్వామి, స్వామి దర్శనార్థం బారులుదీరిన భక్తులు




దొర్నిపాడులో ప్రత్యేక అలంకరణలో హనుమంతుడు, భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

భజే వాలగాత్రం

- ఘనంగా హనుమాన్ జయంతి
- ఆలయాల్లో పవన సుతుడికి ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్త జనం




పూజల్లో పాల్గొన్న భక్తాదులు, రుద్రవరంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు




ఉయ్యాలవాడలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి, నర్సిపల్లె మెట్ట మీద అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: హనుమాన్ జయంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం విఘ్నేశ్వర పూజతో వేడుకలకు అంకురార్పణ చేశారు. ఆలయ పూజరులు రుద్ర సూక్తము, ఫల పంచామృతాలు, 14 రకాల ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకాలు చేసి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి 1,085 తమలపాకులతో ఆకుపూజ చేపట్టి తీర్థ ప్రసాద వితరణ చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.

దొర్నిపాడు: మండలంలో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే స్వామివారికి ఆకు పూజచేసి దర్శించుకున్నారు. కొండాపురం, దొర్నిపాడు, క్రిష్టిపాడు తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ఆలయాల్లో వెలసిన ఆంజనేయ స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో వెలసిన సీతారామాంజనేయ, వేణుగోపాలస్వామి, వాసాపురం వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలతో పాటు ప్రత్యేకంగా వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో కూడా మూల విరాట్‌కు అభిషేకించి ఆకుతోరణాలతో అలంకరించారు. స్థానిక పడమటి వీధి,శివాలయం వీధిలోని కాశీ ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, నర్సిపల్లె, పుచ్చకాయలపల్లె గ్రామాల్లోని పలు దేవాలయాల్లో వెలిసిన అభయాంజనేయస్వామికి శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు, సింధూరపూజ, తమలపాలకులతో అర్చన, అలంకారం, వడమాల అనంతరం సామూహిక కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నర్సిపల్లె గ్రామ సమీపంలోనున్న మెట్ట వద్ద ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

శిరివెళ్ల: వెంకటాపురంలో శనివారం శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హన్‌మాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చన, అలంకార పూజలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం జరిగింది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



కాళికాంబ చంద్రశేఖర దేవాలయంలో అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బైటి పేట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో బైటిపేట ఆంజనేయస్వామి



నూతన ముత్యపు కవచం అలంకారంలో సంజీవ నగర్ రామాలయంలోని అభయాంజనేయస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పలు దేవాలయాల్లో వైశాఖ మాసం శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పంచామృతాభిషేకాలు, పూలంగిసేవ, ఆకుపూజ, సింధూరపూజ, వడమాల, అరటి పండ్లతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

- బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి సింధూర అభిషేకం, తమలపాకులతో అర్చన, వడమాల, పూలంగిసేవ, అరటి పండ్లతో అలంకరింపజేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.
- సంజీవనగర్ రామాలయంలో వేడుకలను శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి ఉదయమే క్షీరాభిషేకం, నూతన ముత్యపు కవచం అలంకరించి హనుమాన్ చాలీసా పారాయణం, మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం దేవాలయం ఆవరణంలో పల్లకీసేవ జరిపించారు.
- టెక్కెలోని నాగులకట్ట గౌరీ సహిత స్పటిక లింగేశ్వర ఆభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, సింధూరాభిషేకాలు, తమలపాకుల అర్చన, 108 వడమాల అలంకరించి స్వామి వారికి 1,008 అరటి పండ్లతో సహస్ర నామార్చాన ప్రత్యేక పూజలు చేశారు.
- స్థానిక దేవనగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయన్నే స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకాలు, క్షీరాభిషేకం నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.
- బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి నగరడోన సుధీర్ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ చేశారు.
- కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో శ్రీ కాళిమాత సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, సింధూరాభిషేకం నిర్వహించి తమలపాకులతో అలంకరణ, వడమాల సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చారు.



టెక్కె నాగులకట్ట దేవాలయంలో 1,008 అరటి పండ్లతో అలంకరణ



పక్షం రోజుల క్రితం : రుద్రవరం సమీపంలో మోడుబారిన నల్లమల అడవి



ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్న అటవీ ప్రాంతం

చిగురు తొడిగిన నల్లమల

పచ్చటి అందాలు,పక్షుల కిలకిలరావాలతో ఆహ్లాదకర వాతావరణంతో పర్యాటకులకు నల్లమల అడవి ఎంతో అనుభూతినిచ్చేది. అయితే వేసవిలో ఆకులన్నీ రాలి అడవంతా మోడువారి కళావిహీనంగా మారింది. గతేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడం,ఎండలు అతి తీవ్రంగా ఉండటంతో అడవంతా పచ్చదనం కోల్పోయింది. ఇటీవల వరుసగా మూడు భారీ వర్షాలు కురవడంతో అడవి మళ్లీ చిగురు తొడిగింది. దీంతో పచ్చగా కళకళలాడుతోంది. – రుద్రవరం

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్



వంటల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని మాస్టర్ ట్రైనర్ రామలక్ష్మమ్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్య నిర్వాహకులకు సూచించారు. శనివారం స్థానిక మోడల్‌స్కూల్‌లో నిరాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భోజనం తయారీలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, మెలుకువలు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం వంటకాలను ప్రధానోపాధ్యాయులు పరిశీలించిన తరువాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. మండల పరిధిలో 57 మంది ఏజెన్సీ నిర్వాహకులు వుండగా కేవలం 27 మంది మాత్రమే హాజరయ్యారు. సీఆర్పీలు సిద్దమ్మ, లక్ష్మిదేవి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై శనివారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏజెన్సీ మహిళలకు శిక్షణ ఇచ్చారు. ట్రైనర్ ఆశా రాణి వారికి శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తాజ్‌హోటల్ వారు విజయవాడలో రుచి, శుచిపై రెండు రోజుల పాటు ఎంపిక చేసిన మహిళలకు శిక్షణ ఇచ్చారని చెప్పారు. నిర్వాహకులు తయారు చేసే భోజనాన్ని రుచి చూశారు. గుంప్రమాన్‌దిన్నె ప్రాథమిక పాఠశాల మహిళలకు ప్రథమ బహుమతి లభించింది. ఇసుకపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, బోయలకుంట్ల ఉర్దూ పాఠశాల మహిళలకు ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పథకం జిల్లా కో–ఆర్డినేటర్ ఖలీల్ నాణ్యతపై పలు సూచనలు చేశారు. పోషకాహారంపై ప్రభుత్వ డాక్టర్ ముఖేష్ మహిళలకు వివరించారు. సీఆర్పీలు అన్సర్, గుర్రప్ప, పుల్లయ్య పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో నీటి ఎద్దడిని అరికట్టాం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తనీయకుండా ముందస్తు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. ఆయన మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం ఎంపీడీఓ సుర్యానారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు షేక్.ఇమ్రాన్ మాట్లాడుతూ టీబీ నివారణ బీసీజీ టీకా వేయడం ప్రారంభించాని చెప్పారు. అటవీ శాఖ డి.వనిపెంట సెక్షన్ అధికారి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను పెంచటానికి ముందుకు రావాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌కు ముందే తిప్పనపల్లె, చిన్నవంగలి, నగళ్ళపాడు గ్రామాల్లో బోర్లు వేయించి, మోటార్లను అమర్చామన్నారు. మేరంగనేతాజీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 150 క్వింటాళ్ళ జీలుగ విత్తనాలు మంజూరవగా వాటిని రైతులకు అందజేస్తామని, మరో 350 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. జిలుగల పంపిణీని వచ్చే వారంలో పూర్తి చేస్తామన్నారు. ముత్యాలపాడు గ్రామంలో ఉపాధి హామి పనులు చూపించటం లేదని కూలీలందరూ తమను ప్రశ్నిస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు వెంకట రాముడు ప్రశ్నించగా ఉపాధి హామీ సిబ్బంది వెంకటన్న సమాధానం ఇస్తూ పనుల ఆమోదానికి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రుద్రవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయని, విజయోత్సవ సంబరాలను నిషేధించామని, వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడరాదని సూచించారు.

పింఛన్‌దారులకు తప్పని తిప్పలు



పెద్దకంబలూరు గ్రామ సచివాలయంలో పింఛన్ సొమ్ము తీసుకుంటున్న లబ్ధిదారులు



శ్రీరంగాపురంలో సచివాలయం నుంచి వెనుతిరిగి వెళ్తున్న వృద్ధురాలు నర్సమ్మ

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న పింఛన్ దారులకు ఈ నెల కూడా తిప్పలు తప్పలేదు. శనివారం 1వ తేదీ కావడంతో ఉదయాన్నే పింఛన్ సొమ్ము ఇంటి వద్దకు వస్తుందని వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూశారు. ఎంత సేపటికీ ఎవరూ రాకపోవడంతో గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లారు. అక్కడ తమ పేర్లు ఉంటేనే సొమ్ము ఇస్తామని, లేదంటే బ్యాంకులు, పోస్టాపీసులకు వెళ్లి తెచ్చికోవాలని సిబ్బంది సూచించార. అయితే మండల కేంద్రమైన రుద్రవరం ,ఆలమూరు,ఎల్లావత్తుల గ్రామాల్లో మాత్రమే బ్యాంకులు ఉన్నాయి. మిగిలిన గ్రామాలకు చెందిన వారు శిరివెళ్ల, గాజులపల్లె, ఆళ్లగడ్డ, ఎర్రగుంట్ల గ్రామాల్లోని బ్యాంకులకు వెళ్లి పింఛన్ సొమ్ము తెచ్చుకున్నారు.



క్రిష్టిపాడులోని సర్వీస్ సెంటర్ వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు

దొర్నిపాడు: చంద్రబాబు చేసిన నిర్వాకం వల్ల మూడో నెల కూడా పింఛన్‌దారులకు సొమ్ము చేతికి అందక పాట్లు పడ్డారు. ఎక్కడ చూసినా బ్యాంకులు, గ్రామాల్లోని కస్టమర్ సర్వీస్ పాయింట్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. 9సచివాలయాల పరిధిలో 917 మందికి ఇంటివద్దనే పింఛన్ సొమ్మును సచివాలయ ఉద్యోగులు అందజేశారు. బుర్రారెడ్డిపల్లె 133, చాకరాజువేముల 178, దొర్నిపాడు–1లో 92, దొర్నిపాడు–2లో 87, గుండుపాపల 98, కొండాపురం 114, క్రిష్టిపాడు 75, డబ్ల్యూ గోవిందిన్నె 83, డబ్ల్యూ కొత్తపల్లె 57 పింఛన్లను ఇంటివద్దనే లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో మొత్తం 3,678 పింఛన్లు ఉండగా వాటిలో 917 ఇళ్లవద్దకే వచ్చి ఇస్తారని మిగతా 2,761 మందికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు ఎంపీడీ సుబ్బారెడ్డి తెలిపారు.